సాక్షి విశాఖపట్నం

సోమవారం । 11 । సెప్టెంబర్ । 2023



జీ-20 సమ్మిట్‌లో అరకు కాఫీ

అరకు క్యాఫీ ఖ్యాతి దేశ, విదేశాలకు వ్యాపించింది. న్యూఢిల్లీలో జరిగిన జీ- 20 సమ్మిట్ ఇందుకు వేదికగా నిలిచింది. 8లో



కదిలొచ్చిన కేరళీయం

కేరళీయం కదిలొచ్చింది.. సంప్రదాయం ఉట్టిపడింది.. భరతనాట్యం కళ్లకు కట్టింది. ఓనం వేడుక అంబరాన్ని తాకింది. 8లో

15 నుంచి వైశాఖీ నృత్యోత్సవాలు



అంతర్జాతీయ నాట్య కళాకారుల నృత్య విన్యాసాలకు మద్దిలపాలెం కళాభారతి వేదిక కానుంది. 8లో

న్యూస్‌రీల్

స్టీల్ మెల్ట్ షాప్ కన్వర్టర్ లైనింగ్ లైఫ్ రికార్డు



విజయకేతనం చూపుతున్న ఉద్యోగులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ స్టీల్ మెల్ట్ షాప్-2లోని ఎల్‌డీ కన్వర్టర్-1 లైనింగ్ లైఫ్ రికార్డు నమోదు చేసింది. ఉక్కు ఉత్పత్తి ప్రక్రియలో కన్వర్టర్ చాలా కీలకమైంది. కన్వర్టర్ రసాయన ప్రతి చర్యలకు వ్యతిరేకంగా అవసరమైన ఇన్సులేషన్‌ను లైనింగ్ అంటారు. లైనింగ్ కాలపరిమితి పెరగడం ద్వారా ఉక్కు ఉత్పత్తి, ఉత్పాదకత, ఇంధన సామర్థ్యం పెంపు తదితర ప్రయోజనాలు లభిస్తాయి. ఈ నెల 9న శనివారం రాత్రి షిఫ్ట్‌లో 7,849 లైనింగ్ లైఫ్ సాధించి పాత రికార్డును అధిగమించింది. ఇంతకు ముందు 2019 సెప్టెంబర్ 17న అత్యధికంగా 7,847 లైనింగ్ లైఫ్ సాధించింది. ప్లాంట్ ప్రారంభం నుంచి స్టీల్‌మెల్ట్ షాప్-1, స్టీల్‌మెల్ట్ షాప్-2 రెండింటిలో ఇది ఉత్తమ లైనింగ్ లైఫ్ కావడం గమనార్హం. ఈ సందర్భంగా విభాగం ఉద్యోగులను సీఎండీ అతుల్ భట్, డైరెక్టర్(ఆపరేషన్స్) ఇన్‌చార్జ్ ఎ.కె. బాగ్చీ అభినందించారు.

డీఆర్వోగా మోహన్‌కుమార్ బాధ్యతల స్వీకరణ



మోహన్‌కుమార్‌ను అభినందిస్తున్న పూర్వపు డీఆర్వో శ్రీనివాసమూర్తి

మహారాణిపేట: జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్వో)గా కె.మోహన్‌కుమార్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్టీఆర్ జిల్లా రెవెన్యూ అధికారిగా ఉన్న కె.మోహన్‌కుమార్‌ను విశాఖ జిల్లా డీఆర్వోగా బదిలీ చేస్తూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఇప్పటివరకు విధులు నిర్వర్తించిన డీఆర్వో ఎస్.శ్రీనివాసమూర్తి నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఆయన్ని కలెక్టరేట్ సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు జైళ్ల శాఖ జాతీయ సదస్సు

ఆరిలోవ: రుషికొండలోని సాయిప్రియ రిసార్ట్స్‌లో సోమవారం నుంచి రెండు రోజుల పాటు జైళ్ల శాఖ ఎనిమిదో జాతీయ సదస్సు జరగనుంది. ఇందుకోసం రాష్ట్ర జైళ్ల శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇప్పటికే అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన జైళ్ల శాఖ డీఐజీలు, ఉన్నతాధికారులు నగరానికి చేరుకున్నారు. వీరందరికీ సాయి ప్రియ రిసార్ట్స్, వైజాగ్ కన్వెన్షన్ హాలులో వసతి సౌకర్యం కల్పించినట్లు జైళ్ల శాఖ డీఐజీ ఇండ్ల శ్రీనివాస్ తెలిపారు. ఈ సదస్సు ఉదయం 9.30 గంటలకు ప్రారంభమవుతుందన్నారు.

శ్రీనగర్ చేరుకున్న కార్పొరేటర్లు

నేడు మేయర్, మరికొంత మంది పయనం

దాబాగార్డెన్స్: జీవీఎంసీ కార్పొరేటర్లు ఆదివారం అధ్యయన యాత్రకు బయలుదేరి వెళ్లారు. మొత్తం 81 మంది అధ్యయన యాత్రకు సంసిద్ధత వ్యక్తం చేయగా.. ఆదివారం 70 మంది కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు ఇక్కడి నుంచి బయలుదేరి.. సాయంత్రం నాలుగు గంటలకు శ్రీనగర్ చేరుకున్నారు. వీరిలో 45 మంది వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు, 18 మంది టీడీపీ, ఇద్దరు జనసేన, బీజేపీ, సీపీఐ నుంచి ఒక్కో కార్పొరేటర్‌తో పాటు ముగ్గురు కోఆప్షన్ సభ్యులు ఉన్నారు. సోమవారం మేయర్ గొలగాని హరి వెంకటకుమారితో పాటు తెలుగుదేశం ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాస్, ఇద్దరు డిప్యూటీ మేయర్లు మొత్తంగా 11 మంది వెళ్లనున్నారు. వీరు అమృత్‌సర్, శ్రీనగర్ మున్సిపల్ కార్పొరేషన్లలో జరుగుతున్న అభివృద్ధి, స్వచ్ఛభారత్ కార్యక్రమాలు, తాగు, మురుగునీటి వ్యవస్థల నిర్వహణపై అధ్యయనం చేస్తారు. 11న శ్రీనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌ను సందర్శించి.. ప్రజాప్రతినిధులు, అధికారులతో సమావేశమవుతారు. 12న జోజిల్లా, జీరో పాయింట్, తాజ్‌వాస్ సందర్శించి అభివృద్ధి పనులు పరిశీలిస్తారు. 13న కాత్రా చేరుకుంటారు. 14న మాతా వైష్ణోదేవి టెంపుల్‌ను సందర్శిస్తారు. 15న అమృత్‌సర్‌లో గోల్డెన్ టెంపుల్, జలియన్‌వాలాబాగ్, ఇండో-పాక్ బోర్డర్, 16న అమృత్‌సర్ మున్సిపల్ కార్పొరేషన్‌ను సందర్శించి అనంతరం ఢిల్లీ చేరుకుంటారు. 17న వ్యక్తిగత పనులు చూసుకుని.. అనంతరం విశాఖ రానున్నారు. కాగా.. వివిధ కారణాల వల్ల మిగిలిన కార్పొరేటర్లు టూర్‌కు దూరంగా ఉన్నారు.

అవినీతి బద్ధాల కోటకు బీటలు



- స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో చంద్రబాబుకు షాక్
- 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించిన ఏసీబీ కోర్టు
- చట్టం చుట్టమంటూ ఊరేగిన బాబుకు జైలుపై సర్వత్రా హర్షం

సాక్షి, విశాఖపట్నం : పాపం పండింది.. ఇన్నాళ్లు వ్యవస్థల్ని మేనేజ్ చేస్తూ.. ప్రజల్ని మాటలతో మభ్యపెడుతూ మచ్చలేని నాయకుడినంటూ బీరాలు పలికిన చంద్రబాబు బండారం బట్టబయలైంది. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో అవినీతి చక్రవర్తి చంద్రబాబేనని విశ్వసించిన ఏసీబీ న్యాయస్థానం 14 రోజులు జ్యుడిషియల్ కస్టడీ విధించింది. రాష్ట్రంలో కుంభకోణాలకు ఆద్యుడిగా నిలిచినా.. ఇన్నాళ్లు తప్పించుకు తిరిగిన చంద్రబాబు.. స్కిల్ కుంభకోణంలో మాత్రం తప్పించుకోలేని తప్పులు చేస్తూ.. అడ్డంగా దొరికిపోయి మొదటిసారి జైలు ఊచలు లెక్కపెట్టనున్నారు. చంద్రబాబును రిమాండ్‌కు తరలించడంపై అన్ని వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. నాయకుడిని అరెస్ట్ చేసిన విషయం తెలిసినా.. టీడీపీ వర్గాలు మాత్రం రోడ్లమీదకు వచ్చి అవినీతి నాయకుడికి మద్దతు తెలిపే ప్రయత్నం కూడా చేయకపోవడం కొసమెరుపు.

బెయిల్‌పై ప్రతి ఒక్కరిలోనూ చర్చ

వ్యవస్థలను మేనేజ్ చేయడంలో ఆరితేరిపోయిన చంద్రబాబును సీఐడీ అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరుస్తుందన్న విషయంపై సర్వత్రా చర్చ మొదలైంది. కోర్టుకు వెళ్లేలోపే ఏదో విధంగా మాయ చేసి బాబు బయటికి వచ్చేస్తారంటూ అంతా భావించారు. అయితే.. కేసు లోతు.. చేసిన స్కాం గురించి మీడియాలో తెలుసుకున్న వారంతా చంద్రబాబుకు జైలే కరెక్ట్ అని అనుకున్నారు. అరెస్ట్ చేసినప్పటి నుంచి కోర్టులో ఆర్డర్ జారీ చేసేంత వరకూ ప్రజలంతా ఉత్కంఠగా ఎదురు చూశారు. చంద్రబాబుకు రిమాండ్ విధించిన వార్త విని పాపం పండే రోజు వచ్చిందని వ్యాఖ్యానించారు.

జారుకున్న టీడీపీ నేతలు

చంద్రబాబు అరెస్ట్ నేపథ్యంలో కార్యకర్తలు రోడ్లపైకి వచ్చి నిరసనలు నిర్వహించాలంటూ టీడీపీ హుకుం జారీ చేసింది. అయితే కొందరు నేతలు స్కిల్ కుంభకోణంలో పక్కాగా ఆధారాలున్నట్లు స్పష్టమవుతున్న నేపథ్యంలో ఎందుకు ధర్నాలు చేయాలంటూ అసహనం వ్యక్తం చేశారు. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఆగ్రహం వ్యక్తం చేసినా పట్టుమని పది మంది కూడా రోడ్లపైకి వచ్చే పరిస్థితి కనిపించలేదు. పార్టీ కార్యాలయంలో దీక్షలు చేయాలన్న టీడీపీ అధిష్టానం పిలుపునకు కూడా పార్టీ నేతల్లో స్పందన కనిపించలేదు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు అరెస్టుకు నిరసనగా సోమవారం బంద్‌కు పిలుపునివ్వడంపైనా పార్టీలో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. అడ్డంగా దొరికిపోయినప్పుడు.. కోర్టు కూడా రిమాండ్ విధించిన తర్వాత బంద్ ప్రకటిస్తే.. ప్రజల్లో వ్యతిరేకత వస్తుందని కొందరు వాదించినా.. ముఖ్య నేతలు మాత్రం కచ్చితంగా బంద్‌ని కఠినంగా నిర్వహించాలంటూ తెగేసి చెప్పడంపై విసుక్కుంటున్నారు.

చంద్రబాబు ప్రత్యేకం కాదు



గత చరిత్ర చూసుకుంటే.. అవినీతికి పాల్పడిన వారందరూ శిక్ష అనుభవించారు. వారితో పోల్చుకుంటే చంద్రబాబు ప్రత్యేకం కాదు. తప్పు చేస్తే శిక్ష అనుభవించాలని రాజ్యాంగం స్పష్టం చేస్తోంది. అవినీతికి పాల్పడలేదని న్యాయస్థానంలో రుజువైతే చంద్రబాబు బయటకు వస్తారు. లేదంటే అందరిలా శిక్ష అనుభవించాల్సిందే.

– డాక్టర్ విజయకుమార్, విశ్రాంత ప్రొఫెసర్

చట్టం ఎవరికి చుట్టం కాదు



చట్టం ఎవరికీ చుట్టం కాదు. ఎంతటి వారికైనా చట్టం ఒక్కటే. ఇది చంద్రబాబు విషయంలో రుజువైంది. ఏసీబీ కోర్టు ఆయనకు 14 రోజులు రిమాండ్ విధించి న్యాయాన్ని కాపాడింది. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు యువతకు స్కిల్స్ నేర్పించలేదు గానీ.. తన స్కిల్స్‌తో వ్యవస్థలను మేనేజ్ చేశారు.

– కోలా గురువులు, వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు

చంద్రబాబుది సరికొత్త రికార్డ్



డబ్బుతో వ్యవస్థలను మేనేజ్ చేసే చంద్రబాబుకు తొలిసారి ఎదురుదెబ్బ తగిలింది. మాజీ సీఎం చంద్రబాబు జైలుకు వెళ్లి సరికొత్త రికార్డు నెలకొల్పారు. వెన్నుపోటు, అవినీతి, స్కాంలు చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్యలాంటివి. ఎన్ని స్కాంలు చేసినా ఎవరూ ఏం పీకలేరని ప్రగల్బాలు పలికే చంద్రబాబుకు శిక్ష తప్పదు.

– వంశీకృష్ణ శ్రీనివాస్, ఎమ్మెల్సీ

చట్టం ముందు ఒకటే..



ఫేక్ కంపెనీలు సృష్టించి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తే చట్టం చూస్తూ ఊరుకోదు. 40 ఏళ్ల రాజకీయ చరిత్ర ఉన్న చంద్రబాబు అవినీతికి పాల్పడడం, కోర్టుల నుంచి ముందస్తు స్టే తెచ్చుకోవడం పరిపాటిగా మారింది. ఈ సారీ అలానే చేయొచ్చని భావించారు. కానీ న్యాయం గెలిచింది. ఇలాంటి అవినీతి పరులకు తగిన శిక్ష పడాల్సిందే.

–వరుదు కల్యాణి, ఎమ్మెల్సీ

న్యాయాన్ని కొనలేవు బాబు



అవినీతి, అక్రమాలకు పాల్పడి సంపాదించిన డబ్బులతో చంద్రబాబు వ్యవస్థలను తన గుప్పిట్లో పెట్టుకుని మేనేజ్ చేశారు. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో సాక్ష్యాధారాలతో ఆయన దొరికిపోయారు. రానున్న రోజుల్లో అతని పూర్తి అవినీతి చరిత్ర బహిర్గతం కానుంది.

– డాక్టర్ కుంభా రవిబాబు, ఎమ్మెల్సీ

ఇది ఆరంభం మాత్రమే..



చంద్రబాబుపై అనేక అవినీతి కేసులున్నా.. ధైర్యంగా విచారణను ఎదుర్కొన్న సందర్భాలు లేవు. ప్రతీ సారి స్టేలు తెచ్చుకుని తనను ఎవరూ ఏం చేయలేరన్న భ్రమలోనే ఉన్నారు. కానీ రోజులు ఎప్పుడూ ఒకలాగే ఉండవు. అవినీతి చేసిన వారు శిక్ష అనుభవించాల్సిందే. 'స్కిల్' స్కాంలో చంద్రబాబు పూర్తిస్థాయి ఆధారాలతో దొరికిపోయారు.

– అన్నంరెడ్డి అదీప్‌రాజ్, పెందుర్తి ఎమ్మెల్యే

స్కాంలన్నీ బయటకొస్తాయి



మాజీ సీఎం చంద్రబాబు ఎన్నో స్కాంలు చేసి.. ఇన్ని రోజులు చట్టానికి దొరక్కుండా తిరిగారు. చట్టం ఏమీ చేయలేదన్నది ఆయన అభిప్రాయం. కానీ ఈ రోజు న్యాయం గెలిచింది. తప్పు చేసిన వారికి శిక్ష తప్పదు. రానున్న రోజుల్లో చంద్రబాబు స్కాంలన్నీ ఒక్కొక్కటిగా బయటకు వస్తాయి.

– ఎంవీవీ సత్యనారాయణ, ఎంపీ, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త

తప్పు చేస్తే శిక్ష తప్పదు



తప్పు చేస్తే చట్టం దృష్టిలో ఎటువంటి వారికైనా శిక్ష తప్పదు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు విషయంలో ఈ విషయం రుజువైంది. స్కిల్ డెవలప్‌మెంట్‌లో భారీ స్కాంకు పాల్పడి చంద్రబాబు దేశానికి చెడ్డపేరు తీసుకొచ్చారు. చంద్రబాబు అరెస్ట్ న్యాయ ప్రకారమే జరిగింది. ఇది ఎంత మాత్రం రాజకీయ కక్ష సాధింపు కాదు.

– వాసుపల్లి గణేష్‌కుమార్, విశాఖ దక్షిణ ఎమ్మెల్యే


ఆధారాలున్నాయి కాబట్టే..



ఎంతటి పెద్దవారైనా తప్పు చేస్తే శిక్ష అనుభవించాల్సిందే. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వ్యవహారంలో చంద్రబాబుపై వచ్చిన ఆరోపణలకు తగిన ఆధారాలున్నాయి. కాబట్టే కోర్టు ఆయన్ని నిందితుడిగా నిర్ణయించి రిమాండ్‌కు తరలించింది. చట్టానికి ఎవరూ అతీతులు కాదు. చట్టం అందరికీ సమానమే. చివరకు న్యాయమే గెలుస్తుందని మరోసారి స్పష్టమైంది.

– తిప్పల నాగిరెడ్డి, గాజువాక ఎమ్మెల్యే

న్యాయమే గెలిచింది



చంద్రబాబు విషయంలో ఆలస్యంగా అయినా న్యాయం గెలిచిన తీరు అద్భుతం. ఇందులో ఎలాంటి కుట్రలు, రాజకీయ దురుద్దేశం లేదు. చట్టం తన పని తాను చేసుకుపోతుందనడానికి ఇదే నిదర్శనం. చట్టానికి, న్యాయానికి అందరూ సమానులే. ప్రజాస్వామ్యం గెలిచిన రోజుగా.. చంద్రబాబు రాజకీయ జీవితానికి చీకటి రోజుగా ఈ రోజు మిగిలిపోతుంది.

–ముత్తంశెట్టి శ్రీనివాసరావు, భీమిలి ఎమ్మెల్యే

కోర్టులపై నమ్మకం పెరిగింది



స్కిల్ డెవలప్‌మెంట్ స్కాం దేశంలోనే అతిపెద్ద కుంభకోణం. చంద్రబాబు రూ.371 కోట్ల ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేశారు. అంత పెద్ద తప్పు చేసిన ఆయన్ని సీఐడీ అరెస్టు చేస్తే అదేదో కక్ష సాధింపులా విపక్షాలు గగ్గోలు పెట్టడం విడ్డూరంగా ఉంది. చంద్రబాబుకు కోర్టు 14 రోజులు రిమాండ్ వేధించడంతో న్యాయవ్యవస్థపై మరింత నమ్మకం పెరిగింది.

– గొలగాని హరివెంకటకుమారి, మేయర్, జీవీఎంసీ

'స్కాం'తో నిరుద్యోగులకు అన్యాయం



ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరూ ప్రజల ఆస్తిని కాపాడాలి. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాం వల్ల నిరుద్యోగులకు అన్యాయం జరిగింది. వందల కోట్ల ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగం అయింది. ఈ కేసులో ప్రధాన సూత్రధారి చంద్రబాబుకు కోర్టు 14 రోజులు రిమాండ్ విధించి న్యాయాన్ని కాపాడింది. తప్పు చేసే వారికి శిక్ష తప్పదు.

– కె.కె.రాజు, నెడ్ క్యాప్ చైర్మన్, వైఎస్సార్ సీపీ ఉత్తర సమన్వయకర్త

ఆశ్చర్యం ఏమీలేదు



తప్పు చేసిన వాడిని వంద మంది న్యాయవాదులైనా రక్షించలేరు. తప్పు చేయని వాడికి అసలు న్యాయవాదులే అక్కరలేదు. వాస్తవానికి తప్పు చేసినవాడికి అంతరాత్మ ఉంటే అది తప్పో ఒప్పో తెలిసిపోతుంది. గతంలో తప్పులు చేసిన లాలూ ప్రసాద్, జయలలిత, చిదంబరం వంటి వారు జైలు గడప తొక్కినవారే. ఇప్పుడు చంద్రబాబు అరెస్ట్‌లో వింత ఏమీ లేదు.

– బులుసు వెంకటేశ్వర్లు, ప్రముఖ పద్యకవి, తగరపువలస

ఏమి సమాధానం చెబుతారు?



ఎన్నో స్కాంల్లో ప్రమేయం ఉన్నటికీ వ్యవస్థలను మేనేజ్ చేసి, స్టేలు అడ్డుపెట్టుకొని అరెస్టుల నుంచి తప్పించుకున్నారు. చేసిన తప్పులకు మూల్యం చెల్లించక తప్పదు. తప్పు చేసిన వారు చట్టం ముందు తలవంచాల్సిందే. 40 ఏళ్ల రాజకీయ జీవితం.. నేను నిప్పు.. అవినీతి అంటే తెలియదని చెప్పే చంద్రబాబు ఇప్పుడు ఏమి సమాధానం చెబుతారో చూడాలి. న్యాయం గెలిచింది.

– బానాల శ్రీనివాసరావు, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్

మందకృష్ణ తీరు హేయం



అవినీతి ఆరోపణలతో చంద్రబాబు జైలుకు వెళితే టీడీపీ బంద్‌కు పిలుపునివ్వడం? అందుకు ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ మద్దతు తెలపడం హేయమైన చర్య. అవినీతి నాయకులకు మద్దతుగా ఉంటూ ప్రజలకు ఎటువంటి సందేశం ఇవ్వాలనుకుంటున్నారో చెప్పాలి. రాష్ట్ర యువత భవిష్యత్‌కు ఉపయోగించాల్సిన నిధులను చంద్రబాబు స్వాహా చేశారు. యువత ఉసురు ఊరికేపోదు.

– కటుమూరి సతీష్, డిప్యూటీ మేయర్

జెడ్పీ వైస్ చైర్మన్‌కు కన్నీటి నివాళి



అప్పారావు పార్థివ దేహం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్యే అదీప్‌రాజ్, జెడ్పీటీసీలు (ఇన్‌సెట్) తుంపాల అప్పారావు(ఫైల్)

- అప్పారావు మృతితో మర్రిపాలెంలో విషాదచాయలు
- నివాళులర్పించిన మంత్రి అమర్‌నాథ్

సబ్బవరం: ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్, సబ్బవరం జెడ్పీటీసీ సభ్యుడు తుంపాల అప్పారావు(53) మృతితో మర్రిపాలెంలో విషాద చాయలు అలుముకున్నాయి. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన విశాఖలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. గ్రామంలో పాల సొసైటీ అధ్యక్షుడిగా రాజకీయ రంగ ప్రవేశం చేసిన ఆయన అంచెలంచెలుగా ఎదిగారు. మొదటి నుంచి కాంగ్రెస్‌లోనే కొనసాగిన ఆయన.. వైఎస్సార్ సీపీ స్థాపించిన తర్వాత ఆ పార్టీలో చేరారు. రెండు సార్లు సర్పంచ్‌గా, రెండుసార్లు ఎంపీటీసీగా, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్‌గా పని చేశారు. అప్పారావుకు భార్య పార్వతితో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారు తుంపాల ప్రసాద్ మానసిక వికలాంగుడు. మరో కుమారుడు తుంపాల సాయి అటవీశాఖలో అధికారిగా పనిచేస్తున్నారు. ఆయన మరణ వార్త తెలియగానే కుటుంబ సభ్యులతో పాటు బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. పినగాడి నుంచి మర్రిపాలెం వరకు జరిగిన అప్పారావు అంతిమయాత్రలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పాల్గొన్నారు. మర్రిపాలెంలో ఆయన పార్థివదేహానికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు, పెందుర్తి ఇన్‌చార్జి అన్నంరెడ్డి అజయ్‌రాజ్, ఎంపీపీ బోకం సూర్యకుమారి, జెడ్పీటీసీ సభ్యులు పైలా సన్యాసిరాజు, ఈర్లి అనురాధ, కర్రి సత్యం, జానకిరాం, బీసీ సెల్ అధ్యక్షుడు కోటాన రాము, యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్‌రాజ్, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్, జిల్లా వీఆర్వోల సంఘం అధ్యక్షుడు సబ్బవరపు త్రినాథ రామకాసు, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు, బోకం రామునాయుడు తదితరులు నివాళులర్పించారు.

కంగుతిన్న తమ్ముళ్లు



టీడీపీ కార్యాలయంలో పూలు చల్లుకుంటున్న టీడీపీ నేతలు

చంద్రబాబుపై ఏ కేసు వేసినా అవి నిలబడవని అందరికీ తెలిసిందే. ఎన్ని అవినీతి పనులు చేసినా చంద్రబాబు చిక్కడు దొరకడని ముందే తెలుసు కాబట్టి ఓవైపు వాదనలు జరుగుతుండగానే.. బెయిల్ వచ్చేసిందంటూ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నేతలు సంబరాలు చేసుకున్నారు. పార్టీ విశాఖ పార్లమెంటరీ శాఖ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు నేతృత్వంలో ఆదివారం ఉదయం నుంచి దీక్షలు చేపట్టారు. సాయంత్రం 3 గంటలకు కోర్టులో వాదనలు కొనసాగుతున్న సమయంలో ఎలాగూ బాబు బెయిల్‌పై బయటికి వచ్చేస్తారన్న అతి విశ్వాసంతో పల్లా ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో సంబరాలు చేసుకున్నారు. స్వీట్లు తినిపించుకున్నారు. కోర్టు రిమాండ్ విధించిందని తెలుసుకుని నైరాశ్యంలోకి వెళ్లిపోయారు.

టీడీపీ నాయకుల సంబరాలు



పీఎంపాలెంలో బాణసంచా కాల్చుతున్న టీడీపీ 6వ వార్డు అధ్యక్షుడు శ్రీనివాసరావు, పార్టీ శ్రేణులు

మధురవాడ: పీఎం పాలెంలో టీడీపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. చంద్రబాబును సీఐడీ పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచిన దగ్గర నుంచే న్యాయం గెలిచింది.. తమ నేతకు బెయిల్ వచ్చేసిందన్న వార్తలు సోషల్ మీడియాలో తెగ ట్రోలింగ్ చేశారు. అబద్ధపు ప్రచారాలతో హోరెత్తించారు. అంతటితో ఆగలేదు. ఒక అడుగు ముందుకు వేసి పీఎంపాలెంలో జీవీఎంసీ 6వ వార్డు టీడీపీ అధ్యక్షుడు దాసరి శ్రీనివాసరావు, రాష్ట్ర బీసీ సెల్ నాయకులు గొల్లంగి ఆనందబాబు తదితరులు సాయంత్రం 5 గంటల సమయంలో బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. విషయం బయటకు పొక్కడంతో టీడీపీ తమ్ముళ్లు కూడా ముక్కున వేలేసుకున్నారు.

'బంద్‌కు పిలుపునివ్వడం సిగ్గుచేటు'



ఆరిలోవ: అవినీతి ఆరోపణలతో చంద్రబాబు నాయుడు జైలుకు వెళితే ఆ పార్టీ రాష్ట్ర బంద్‌కు పిలుపునివ్వడం సిగ్గుచేటని జనజాగరణ సమితి రాష్ట్ర కన్వీనర్ వాసు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బంద్ పేరుతో సామాన్య ప్రజలను ఇబ్బంది పెట్టడం తగదన్నారు. గంటకు రూ.1.5 కోట్లు ఫీజు చెల్లించి న్యాయవాదిని నియమించుకొని వాదించినా కూడా బెయిల్ రాలేదంటే సరైన సాక్ష్యాధారాలతోనే న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారని అర్థం చేసుకోవచ్చన్నారు. రాజకీయ కక్ష సాధింపు పెట్టిన కేసు అయితే కోర్టులో నిలబడదు కదా అని ప్రశ్నించారు. టీడీపీ బంద్‌కు రాష్ట్ర ప్రజలు ఎవరు కూడా సహకరించవద్దని కోరారు.

పర్యావరణహిత ఉత్పత్తులకు ప్రాధాన్యం

రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్



బయోప్లాస్టిక్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి అమర్‌నాథ్

మధురవాడ: ఎకో వైజాగ్‌కి మద్దతుగా పర్యావరణ అనుకూల ఉత్పత్తుల తయారీకి ప్రాధాన్యమిస్తున్నట్టు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. కాపులుప్పాడ డంపింగ్ యార్డులో డీఆర్‌డీవో సహకారంతో ఏర్పాటు చేసిన పృథ్వీ బయోప్లాస్టిక్ ప్లాంట్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ప్లాంట్ పని చేసే విధానం, ఉత్పత్తుల గురించి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ నగరంలో ఒక్క రోజు బీచ్ క్లీనింగ్ కార్యక్రమం చేపడితే 70 టన్నుల వరకు ప్లాస్టిక్ వ్యర్థాలు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో రూ.7 కోట్లు విలువ చేసే బీచ్ క్లీనింగ్ మిషన్లు కొనుగోలు చేశామన్నారు. ఇప్పటికే నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని పక్కాగా అమలు చేస్తున్నామని తెలిపారు. మేయర్ గొలగాని హరివెంకటకుమారి, డీఆర్‌డీవో ప్రాజెక్టు డైరెక్టర్, శాస్త్రవేత్త వీరబ్రహ్మం, భీమిలి ఎంపీపీ డి.వాసురాజు, మాజీ డిప్యూటీ మేయర్ దొరబాబు, సంస్థ సీఈవో వరప్రసాద్, మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతరావు పాల్గొన్నారు.

కదిలొచ్చిన కేరళీయం

- ఉట్టిపడిన సంప్రదాయం
- అలరించిన నృత్య ప్రదర్శనలు
- అంబరాన్ని తాకిన ఓనం సంబరం



బలిచక్రవర్తిని ఆహ్వానిస్తున్న కేరళీయులు



వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి



కేరళీయుల సంప్రదాయ ముగ్గు

పెదగంట్యాడ: కేరళీయం కదిలొచ్చింది.. సంప్రదాయం ఉట్టిపడింది... భరతనాట్యం కళ్లకు కట్టింది. మొత్తమ్మీద ఓనం వేడుక అంబరాన్ని తాకింది. కేరళీయుల సంప్రదాయ పండగ ఓనంను స్థానిక బీసీ రోడ్డులోని అగ్నికులక్షత్రియ కల్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. కైరళీ ఆర్ట్స్‌క్లబ్ ప్రతినిధి ఎస్.జి.విజయకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలను ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ప్రారంభించారు. వేడుకల్లో భాగంగా విద్యార్థినులు నృత్యాలతో అలరించారు. మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. చిన్నారులు ఆట పాటలతో సందడి చేశారు. కేరళ సంప్రదాయ రంగవల్లులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పురుషులు, మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి ఉత్సాహంగా పాల్గొన్నారు. మహిళలు, విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ కేరళీయులు తమ సంస్కృతి, సంప్రదాయాలను మరువకుండా ఏటా ఇక్కడ ఓనం వేడుకలను జరుపుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి, డాక్టర్ అబ్రహం, పి.బిజా, టి.కె.ప్రకాషన్, శ్యామ్‌జిత్ పాల్గొన్నారు.

నాగవంశీయుల అభ్యున్నతికి ఐక్యంగా కృషి



సమావేశంలో సంఘం నాయకులు

పీఎం పాలెం: ఆర్థిక, సామాజిక, రాజకీయ విద్యా, రంగాల్లో అభివృద్ధి సాధించడానికి రాష్ట్రంలోని నాగ వంశీయులు ఐక్యంగా ఉండాలని రాష్ట్ర నాగ వంశీయ నాయకులు పిలుపునిచ్చారు. పీఎం పాలెంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో రాష్ట్ర నాగవంశీయుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ ఏర్పాటుకు ఏకగ్రీవంగా తీర్మానించారు. విశాఖ జిల్లా నాగవంశం జేఏసీ నాయకులు బొడ్డు అప్పలనాయుడు మాట్లాడుతూ వెనుకబడిన వర్గమైన నాగవంశంను బీసీ డీ నుంచి బీసీ ఏ కేటగిరీకి మార్చడానికి అవసరమైన ప్రతిపాదనలు ఇప్పటికే సిద్ధం చేశామన్నారు. ఐక్యతతో సామాజిక వర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నామని జేఏసీ కన్వీనర్ కుంటుభుక్త రామునాయుడు అన్నారు. భీమిలి జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు మాట్లాడుతూ సామాజిక వర్గం అభివృద్ధి విద్యాభివృద్ధితోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో పద్మనాభం మండలం ఎంపీపీ కంటుబోతు రాంబాబు, కాళ్ల గౌరీశంకర్, శ్రావణ కుమార్, అవనాపు విక్రమ్, విజయ్, జరజాపు ఈశ్వరరావు, అవనాపు విజయ్, సముద్రపు రామారావు, చిలకా నరసింగరావు, ఏపీ నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ డొంక వెంకట రమణ, బోని అప్పలనాయుడు, నల్లి రవికిరణ్, జీవీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు జగనన్నకు చెబుదాం

డాబాగార్డెన్స్: జీవీఎంసీలో సోమవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో జగనన్నకు చెబుదాం(గ్రీవెన్స్) కార్యక్రమం నిర్వహించనున్నారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ కోరారు.

15 నుంచి వైశాఖీ నృత్యోత్సవాలు

- నలుగురు అంతర్జాతీయ నృత్య కళాకారులకు పురస్కారాల ప్రదానం



గీతానారాయణ్ (కూచిపూడి), ఏపీ



రోజా కన్నన్(భరత నాట్యం), తమిళనాడు



ఉమా రేలే(భరత నాట్యం), మహారాష్ట్ర

మద్దిలపాలెం: అంతర్జాతీయ నాట్య కళాకారుల నృత్య విన్యాసాలకు మద్దిలపాలెం కళాభారతి వేదిక కానుంది. నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి వైశాఖీ నృత్యోత్సవాలు జరగనున్నాయి. వేడుకల్లో భాగంగా తొలి రోజు 15న డాక్టర్ సరోజా వైద్యనాథన్ ఎక్సలెన్స్ అవార్డును ఆచార్య చూడామణి అవార్డు గ్రహీత రోజా కన్నన్(తమిళనాడు)కు ప్రదానం చేస్తామని ఉత్సవ డైరెక్టర్ బి.ఆర్.విక్రమ్‌కుమార్ వెల్లడించారు. అనంతరం ఆమె భరతనాట్య ప్రదర్శన ఉంటుందన్నారు. 16న మహారాష్ట్రకు చెందిన భరత నాట్య కళాకారిణి డాక్టర్ ఉమా రేలేకు వైశాఖీ ఎక్సలెన్స్ జాతీయ పురస్కారం ప్రదానం చేస్తామన్నారు. అనంతరం ఉమా, నలందా బృందాలతో అద్భుత నాట్య విన్యాసం ఏర్పాటు చేశామన్నారు. 17న డాక్టర్ సరోజ వైద్యనాథన్ నేషనల్ యువ పురస్కారాలను మన రాష్ట్రానికి చెందిన కూచిపూడి నాట్య కళాకారిణి సూడగాని గీతా నారాయణ్, హాంగ్‌కాంగ్‌కు చెందిన భరతనాట్య కళాకారిణి రూపా కిరణ్‌లకు అందజేస్తామన్నారు. అనంతరం వీరి నాట్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంటుందని విక్రమ్‌కుమార్ తెలిపారు.

జీ-20 సమ్మిట్‌లో అరకు కాఫీ

మహారాణిపేట: అరకు క్యాఫీ ఖ్యాతి దేశ, విదేశాలకు వ్యాపించింది. న్యూఢిల్లీలో జరిగిన జి – 20 సమ్మిట్ ఇందుకు వేదికగా నిలిచింది. ఆంధ్రప్రదేశ్ పెవిలియన్‌లో గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ఆధ్వర్యంలో అరకు వ్యాలీ కాఫీని ప్రదర్శించారు. ఈ ఎగ్జిబిషన్ గిరిజన రైతులు పండించిన ప్రత్యేకమైన, అధిక నాణ్యాతా ప్రమాణాలు కలిగిన కాఫీని ప్రదర్శించడానికి ఒక అద్భుతమైన వేదికను అందించింది. ఈ కాఫీ జాతీయ, అంతర్జాతీయ ప్రతినిధుల దృష్టిని ఆకర్షించింది. కాఫీ రంగంలో వాణిజ్య సహకారాన్ని పెంపొందించుకోవడానికి ఒక అవకాశాన్ని కూడా అందించింది. గిరిజనులు పండించిన అరకు కాఫీ రుచులను పరిచయం చేయడం ఎంతో సంతోషంగా ఉందని జీసీసీ మేనేజింగ్ డైరెక్టర్ జి.సురేష్ కుమార్ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అమెరికాలో ప్రదర్శించే అవకాశాలు కల్పిస్తాం

బీచ్‌రోడ్డు: విశాఖలో ప్రతిభావంతులైన సకల కళాకారులకు అమెరికాలో ప్రదర్శించే అవకాశాలు కల్పిస్తానని తానా ప్రపంచ సాహిత్య వేదిక చైర్మన్ తోటకూర ప్రసాద్ అన్నారు. బీచ్ రోడ్డులోని జాలాది విగ్రహానికి ఆదివారం ఆయన పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సుప్రసిద్ధ కవులు, రచయితలు, కళాకారులకు మొదటి నుంచి తానా పెద్దపీట వేస్తోందన్నారు. ఉత్తరాంధ్రలో అన్ని రంగాలకు చెందిన కళాకారులు ఉండడం అభినందనీయమన్నారు. సకల కళాకారుల సంఘం అధ్యక్షురాలు జాలాది విజయ, ప్రతినిధులు చెన్నా తిరుమలరావు, కె.రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

సీఎంఆర్ ఫ్యాషన్ షోరూం ప్రారంభం



సీఎంఆర్ చైర్మన్ ఎంవీఆర్, డైరెక్టర్ మానసతో కంకటాల గ్రూప్ సీఎండీ మల్లిక్

మద్దిలపాలెం: మద్దిలపాలెంలోని సీఎంఆర్ సెంట్రల్‌లో ఆదివారం సీఎంఆర్ ఫ్యాషన్ షోరూం ఘనంగా ప్రారంభమైంది. కంకటాల గ్రూప్ సీఎండీ కంటకాల మల్లిక్ షోరూంను ప్రారంభించి.. శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎంఆర్ ఫౌండర్ అండ్ చైర్మన్ మావూరి వెంకటరమణ మాట్లాడుతూ విశాఖ ప్రజల అభిరుచికి తగ్గట్టుగా నాలుగు దశబ్దాలుగా సరికొత్త డిజైన్లతో అందరికీ అందుబాటు ధరల్లో వస్త్రాలు అందిస్తున్నట్టు తెలిపారు. ఇప్పుడు సరికొత్తగా మద్దిలపాలెం సీఎంఆర్ సెంట్రల్‌లో సీఎంఆర్ ఫ్యాషన్ షోరూం ప్రారంభించామని.. ఇక్కడ ప్రపంచ స్థాయి ఫ్యాషన్‌ను పరిచయం చేస్తున్నామన్నారు. అనంతరం నిర్వహించిన ఫ్యాషన్ షోలో పలువురు ర్యాంప్ వాక్ చేసి అలరించారు. షో విజేతలకు బహుమతులు అందజేశారు. సీఎంఆర్ డైరెక్టర్ మావూరి మానస, జనరల్ మేనేజర్ నూలు లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్ల బాలికపై యువకుడి లైంగికదాడి

సింహాచలం : ఐదేళ్ల బాలికపై పద్దెనిమిదేళ్ల యువకుడు లైంగికదాడికి పాల్పడిన సంఘటన పెందుర్తి జేఎన్ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో చోటుచేసుకుంది. పెందుర్తి సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. రాతిచెరువు దగ్గర ఉన్న జేఎన్ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో ఓ ఫ్లోర్‌లో అభిషేక్ (18) తల్లిదండ్రులు, సోదరితో కలిసి ఉంటున్నాడు. పనీ లేక జులాయిగా తిరుగుతున్నాడు. అదే భవనంలో ఒక అంతస్తులో నివసిస్తున్న ఐదేళ్ల బాలిక ఆడుకునేందుకు వెళ్లగా తన ఫ్లోర్‌కి రమ్మని పిలిచి బొమ్మలు ఇచ్చాడు. అనంతరం తన గదిలోకి తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ విషయం తల్లికి బాలిక చెప్పడంతో వెంటనే పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు బాలికను వైద్య పరీక్షల నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అభిషేక్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేధింపులతో యువకుడి ఆత్మహత్య



పవన్‌కుమార్(ఫైల్)

పెదగంట్యాడ : ఫైనాన్షియర్ వేధింపులు తాళలేక ఓ యువకుడు శనివారం లాడ్జిలో ఆత్మహత్య చేసుకున్నాడు. న్యూపోర్టు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నడుపూరులో పీత గౌరీశ్వర్‌కుమార్ అలియాస్ పవన్‌కుమార్ (26) తల్లితో కలిసి నివాసం ఉంటున్నాడు. వ్యాపారం నిమిత్తం ఓ ఫైనాన్షియల్ సంస్థలో రూ.10 లక్షలు రుణం తీసుకున్నాడు. ప్రతి నెలా విధిగా వాయిదాలు చెల్లిస్తున్న అతను ఈ నెల వాయిదా ఇంకా కట్టలేదు. దీంతో ఆ ఫైనాన్స్ సంస్థకు చెందిన ప్రతినిధి ఆ యువకునితో దుర్భషలాడాడు. మనస్తాపం చెందిన ఆ యువకుడు అరుణా థియేటర్ సమీపంలో ఉన్న ఓ లాడ్జిలో ప్రశాంత్ అనే స్నేహితునితో కలిసి శనివారం సాయంత్రం గది అద్దెకు తీసుకున్నాడు. ఆ యువకునికి ధైర్యం చెప్పిన ప్రశాంత్ శనివారం సాయంత్రం 6 గంటల సమయంలో లాడ్జి నుంచి వచ్చేశాడు. కొంత సమయం తర్వాత లాడ్జికి వెళ్లి ఎంత తలుపు కొట్టినా తీయకపోవడంతో వెంటనే మృతుని తల్లికి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనపై సమాచారం అందుకున్న న్యూపోర్టు సీఐ రాము సిబ్బందితో కలసి లాడ్జికి చేరుకున్నారు. తలుపు గెడ పగులగొట్టి చూసేసరికి గౌరీశ్వర్‌కుమార్ ఫ్యాన్‌కు బెడ్‌షీట్‌తో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకొని కనిపించాడు. యువకుడు తన ఫోన్‌లో ×అమ్మా నన్ను క్షమించు.. నిన్ను బాగా చూసుకుందామనుకున్నాను. అయితే ఏ వ్యాపారం చేసినా నష్టాలు వస్తున్నాయి.. నేను చనిపోతే నీకు రూ.10 లక్షలు ఇన్సూరెన్స్ వస్తుందని, ఆ డబ్బులతో అప్పులు తీర్చి సంతోషంగా ఉండాలంటూ టైపు చేసి ఉంచాడు. మృతుని తల్లి పీత లక్ష్మీ ఫిర్యాదు మేరకు న్యూపోర్టు సీఐ రాము ఆధ్వర్యంలో ఎస్ఐ మన్మథరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు.

న్యాయం చేయాలని ఆందోళన

పీత పవన్‌కుమార్ ఆత్మహత్య చేసుకోవడంతో నడుపూరు గ్రామస్తులు భగ్గుమన్నారు. మృతుని కుటుంబానికి న్యాయం చేయాలంటూ న్యూపోర్టు పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. ఎస్ఐలు మన్మథరావు, శ్రీనివాసరావు వారిని వారించారు. ఫైనాన్స్ సంస్థ ప్రతినిధులతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	505.00
విజయనగరం	509.00
శ్రీకాకుళం	509.00

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	: రూ.158
స్కిన్	: రూ.286
స్కిన్‌లెస్	: రూ.296